# ఒక అడుగు ముందుకు

## యాళ్ళ అచ్యుతరామయ్య

**సమస్య నుండి తెలివిగా బయట పడవేయడానికి ప్రయత్నిస్తున్నారనీ రమేష్ వాదించాడు. శేషగిరిని సంసారానికి పనికి రాకుండా చేయాలని ఒకరూ, కాలో చెయ్యో తీసేయాలని మరొకరూ ఇలా అనేక శిక్షలను...**

ఈ కాలంలో అమ్మాయిలు కాలేజికి చదువుకోడానికి వస్తున్నారో లేక ప్రేమించడానికి వస్తున్నారో అర్థం కావడంలేదు'' అని డిపార్టుమెంటు హెడ్ అక్కడున్న లెక్చరర్స్‌తో అంటుండగా మృణాళిని లోపలికి అడుగు పెట్టింది. ఉదయమే ఏ ఆడపిల్లో ఈయన నోట్లో పడింది. ఈ రోజంతా ఈయన ఇదే టాపిక్ చర్చిస్తూ వుంటాడన్నమాట అని మనసులోనే అనుకుంటూ మృణాళిని నోట్సూ, చార్టులూ పట్టుకుని క్లాసుకు బయలుదేరింది.

ఎప్పుడయినా క్లాసులో ఒక్క స్టూడెంటుకూడా లేకపోయేసరికి, ఆశ్చర్యంతో ఆమె బయటకు వచ్చి చూసింది. విద్యార్థులంతా గార్డెనులో కూర్చుని వున్నారు మృణాళిని వాళ్ళను సమీపించగానే అందరూ ''గుడ్‌మార్నింగ్ మేడమ్'' అంటూ విష్ చేసారు. వాళ్ళందరూ ఎవరి మీదకో యుద్ధానికి తయారవుతున్నంత హడావిడిగా వున్నారు.

అందరి కంటే ఎంతో చురుకుగా వుండే క్రాంతి ముందుకు వచ్చి, ''సారీ మేడమ్, మీకు ముందుగా చెప్పలేక పోయాం — ఈ రోజు మేం క్లాసులకు ఆటెండ్ కావడంలేదు. మన క్లాసులో సుధ వుంది కదండీ! శేషగిరి అనే బి.కామ్ స్టూడెంటు ఆమెను మోసం చేసాడు. అందుకు నిరసనగా ఆమె ఈ రోజు నుండి అతని ఇంటిముందు మౌనపోరాటం చేస్తోంది. ఆమెను సమర్థిస్తూ ఊరేగింపుగా మేం అందరం అక్కడకు బయలుదేరుతున్నాం'' అంది. క్రాంతి ఓ విప్లవ విద్యార్థి సంఘంలో పని చేస్తూ వుంటుంది. చదువులో కూడా ఆమె ఎంతో శ్రద్ధ చూపిస్తుంది.

మృణాళిని ఏం చెబుతుందాని అందరూ ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. వాళ్ళను మిగిలిన లెక్చరర్లకంటె ఆమె అంటె ఎంతో ఇష్టం. విద్యార్థులకు ఏ సమస్య ఎదురయినా, ఆమె వాళ్ళ తరపున నిలబడుతుంది.

''మీరు నడుస్తుండండి నేను డిపార్టుమెంటు హెడ్ పర్మిషన్ తీసుకుని మీతో కలుస్తాను'' అని మృణాళిని బోటనీ డిపార్టుమెంటు వైపుకు నడిచింది. ఇంతకుముందు డిపార్టుమెంటు హెడ్ నోరు పారేసుకుంది సుధ గురించే నన్న మాట.

పెద్ద భవనముందు టెంట్‌వేసి వుంది. దానికి ''సుధ మౌన పోరాటం'' అన్న బ్యానర్ వ్రేలాడుతూ వుంది. అక్కడ సుధా, మరో ఇద్దరు అమ్మాయిలూ కూర్చుని వున్నారు.

టెంట్‌ను సమీపిస్తుండగా విద్యార్థులు నినాదాలు అందుకున్నారు. 'సుధ మౌనపోరాటం వర్ధిల్లాలి! శేషగిరి దౌర్జన్యం నశించాలి! సుధ గర్భానికి కారకుడు తనేనని ఒప్పుకుని, శేషగిరి ఆమెను వివాహం చేసుకోవాలి!'.

అప్పటికే చాలామంది జనం టెంట్ చుట్టూ చేరారు. మృణాళిని స్టూడెంట్సు అందరినీ దగ్గరకు పిలిచి, ''ముందుగా సుధతో మాట్లాడి, తర్వాత మనం ఏం చేయాలన్నది నిర్ణయించుకుందాం. నినాదాలు ఇవ్వడం ప్రస్తుతం మానేయండి. కిషోర్! మన విద్యార్థులు తప్ప, బయట జనాన్ని వెంటనే ఇక్కడినుండి పంపించేసెయ్'' అని చెప్పింది.

స్టూడెంట్సు వలయాకారంలో సుధ, మృణాళిని చుట్టూ కూర్చున్నారు. సుధ చేతిని ఆప్యాయంగా నిమురుతూ మృణాళిని తన అభిప్రాయం చెప్పడం ప్రారంభించింది. ''ఓ మగాడివల్ల మోసపోయినా, చాలా మంది ఆడపిల్లల్లా ఏ అఘాయిత్యం చేసుకోకుండా, ధైర్యంగా నిలబడినందుకు నిన్ను చూస్తుంటే ఎంతో సంతోషంగా వుందమ్మా. తోటి విద్యార్థినికి ఒక సమస్య ఎదురయినపుడు, ఆమెకు అండగా కదలివచ్చిన మీ అందరికీ నా ధన్యవాదాలు.

''ప్రస్తుతం మనం చర్చించబోయే సమస్య ఒక్క సుధది మాత్రమే కాదు, ఇదొక సామాజిక సమస్య. శేషగిరి సుధను మోసగించి ఆమెను గర్భవతిని చేసాడు. పెళ్ళి చేసుకోకపోగా, ఆమెపై హత్యాప్రయత్నం చేసాడు.ఇతని వల్లే గర్భం వచ్చిందని నిరూపించి, నలుగురు ముందూ నిలబెట్టడంవల్ల వచ్చే లాభం ఏమిటి? అందుకు బాధ్యత వహించడానికి శేషగిరి సిద్ధంగా లేనపుడు!''

అంతలో ఒక విద్యార్థిని లేచి, ''అతను సుధను పెళ్ళి చేసుకోడానికి సిద్ధంగా లేకపోయినా, మనందరం కలసి అతని మెడ వంచి, పెళ్ళికి సిద్ధం చేయాలి'' అంది.

మేడమ్ ఏం చెబుతుందాని అందరూ ఎదురు చూస్తున్నారు. ''నేరానికి బలయిపోయిన అమ్మాయిని, ఆ నేరం చేసినవాడికిచ్చి పెళ్ళి చేయాలనుకోవడమేమిటి? ఈ కాలం అమ్మాయిలకు ఆమాత్రం ఆత్మాభిమానం కూడా లేకుండా పోతుందా? ఒకవేళ బలవంతంగా పెళ్ళి చేయించినా, ఈమెను సుఖంగా బ్రతకనిస్తాడా? ఆ తర్వాత అతను మరొక అమ్మాయిని మోసం చేయడని గ్యారంటీ ఏమిటి? అప్పుడు ఆ మరో అమ్మాయిని కూడా అతనికిచ్చి పెళ్ళి చేస్తారా? మోసపోయిన అమ్మాయి ధైర్యంచాలక అటువంటి నిర్ణయానికి వచ్చినా, విప్లవ విద్యార్థి సంఘం దగ్గరుండి పెళ్ళిళ్ళ పేరయ్యలా ఇటువంటి పెళ్ళి జరిపించడానికి సిద్ధమవడమేమిటి?'' అంటూ ఆమె అందరి వంకా చూసింది.

తాము చేస్తున్న పనిని మేడమ్ సమర్థిస్తారని ఎదురు చూస్తున్న విద్యార్థులకు షాక్ తగిలినట్లయింది. అందరికంటే ముందుగా తేరుకున్న సుబ్బలక్ష్మి కళ్ళజోడు సవరించుకుంటూ, ''మేడమ్! ప్రస్తుతం మనం వున్న ఈ పురుషాధిక్య సమాజంలో, ఒకసారి ఓ అమ్మాయికి మరో అబ్బాయితో సంబంధం ఏర్పడిందంటే, చావయినా, బ్రతుకయినా అతనితోనే కదా! అతన్ని కాదని, మరో మగాడు ఆమెను పెళ్ళి చేసుకుంటాడా? చేసుకుంటే సమాజం ఆమెను గౌరవిస్తుందా? మీరు ఒడ్డున వున్నారు కాబట్టి ఎన్నయినా చెబుతారు'' అంది.

మృణాళిని స్వరం పెచ్చింది. ''ఈ జ్ఞానం ముందు లేదా? ఇంతగా సమాజానికి భయపడే వాళ్ళు సమాజం మెచ్చని పనులు చేయడానికి ధైర్యం ఎక్కడినుండి వచ్చింది? ఎవడినో ఒకడిని పెళ్ళిచేసుకుని, జీవితాంతం నరకం అనుభవించే కంటె, పెళ్ళి చేసుకోవడం మానేయడమే మంచిది. పెళ్ళి చేసుకోకపోవడం అభ్యుదయమని నేను చెప్పడంలేదు. జీవితంలోని అనేక ముఖ్య సంఘటనలలో వివాహం ఒకటి మాత్రమే. దానికోసం ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టుకోవలసినంత గొప్పది కాదు అని నా అభిప్రాయం.

''పెళ్ళి కాకుండానే శారీరక సంబంధాలు ఏర్పరచుకునేంత బలహీనతలు మీకు వుంటే, మిమ్మల్ని ఎవరైనా రక్షించగలరా? ఎందుకిదంతా చెబుతున్నానంటే, ఇంకో అమ్మాయి ఎవరూ ఇలాంటి సమస్యల్లో ఇరుక్కోకూడదని''.

క్రాంతి మొహం ఎర్రబడింది. ''మేడమ్! పెళ్ళికాకముందే శారీరక సంబంధాలు కలిగి వుండడానికి బాధ్యులు అమ్మాయిలు మాత్రమేనా? పవర్‌ఫుల్



మేడియా అయిన సినిమాలూ, టీ.వీలూ, పత్రికలూ ఏవి చూసినా యువతీ యువకులను రెచ్చగొట్టే విధంగా సెక్స్‌ను ప్రచారం చేస్తున్నాయి. పెళ్ళీడు వచ్చినా, కట్నాలిచ్చి పెళ్ళిళ్ళు చేసుకోలేని యువతులు ఎవరైనా మగాళ్ళు వేసిన వలలో చిక్కుకుపోతే, అది పూర్తిగా వాళ్ళ తప్పేనా?"

ఆ మాటలకు మృణాళినికి కోపం ఏమీ రాకపోగా, చిరునవ్వుతోనే సమాధానం చెప్పింది. "క్రాంతీ, మంచి ప్రశ్న వేశావమ్మా. నేటి యువతలోని బలహీనతలకు బాధ్యత చాలా వరకూ చుట్టూవున్న సంఘానిదీ, ప్రభుత్వానిదీను. కానీ, ఆ రెండూ బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తున్నప్పుడు, ఆ సమస్యలవల్ల ఎవరయితే ఇబ్బందులకు గురవుతున్నారో, వాళ్ళే జాగ్రత్తలు తీసుకోవలసి వస్తుంది. ఇందులో కొంతవరకూ తల్లిదండ్రుల బాధ్యత కూడా వుంది".

విద్యార్థులకూ, మృణాళినికీ మధ్య ఇలా ఎన్నో వాదోపవాదాలు జరుగుతున్నాయి. సుధ మెదడులో ఆలోచనా తరంగాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఆమెకు మొదటి నుండీ ప్రేమ వివాహం చేసుకోవాలనే వుండేది. శేషగిరికీ, ఆమెకూ సాంస్కృతిక కార్యక్రమాలంటే చాలా ఇష్టం. అందువల్ల, ఇద్దరికీ పరిచయమేర్పడింది. అతని మంచిచెడ్డలు తెలుసుకోవడానికి అతనితో నాలుగయిదు రోజులు పార్కులకూ, సినిమాలకూ వెళ్ళిందో లేదో వాళ్ళిద్దరి పేర్లూ కాలేజీ గోడల కెక్కేసాయి.

అతడెంత మోసగాడో తెలుసుకునేసరికి, ఆమె అప్పటికే అతని వలపు ఊబిలో పీకలదాకా మునిగిపోయింది. దాని నుండి బయటపడే మార్గం తెలీక, అతనెంత తప్పించుకు తిరుగుతున్నా, అతన్నే పెళ్ళి చేసుకోవాలను కుంది. కాని, మేడమ్ చెప్పినదాని ప్రకారం, అతన్ని పెళ్ళి చేసుకోవాలనుకోవడం అతనివల్ల వచ్చిన గర్భాన్ని అలానే ఉంచుకోవాలనుకోవడం రెండూ తప్పేననిపిస్తోంది. మేడమ్ సహాయంతో, డిగ్రీ అయిపోయాకా, చిన్న ఉద్యోగం సంపాదించుకుని స్వేచ్ఛగా బ్రతకడమే మేలు అనిపిస్తోందామెకు.

సుధ ఏమి చెబుతుందాని అందరూ ఎదురు చూస్తున్నారు. ఆమె మృణాళిని వంక చూసి, "మేడమ్, మీరు చెప్పినదంతా విన్నాకా, అతన్ని పెళ్ళి చేసుకోకూడదనే నిర్ణయించుకున్నాను. కాని, శేషగిరివల్ల మరో అమ్మాయికి అన్యాయం జరగకుండా వుండేట్లు, అతన్ని శిక్షించాలి. ఎలా?"

"నేటి సమాజంలో స్త్రీ పురుష సంబంధాలు చెడిపోయి, ఏదయినా సమస్య ఎదురయితే అందులో ముఖ్యంగా నష్టపోయేది స్త్రీ. మగాడిని శిక్షించడం చాలా కష్టం. అయినా సుధ దగ్గరున్న ప్రేమలేఖలూ, ఇతర ఆధారాలతో అతనికి శిక్షపడడానికి ప్రయత్నం చేస్తాను. అంతేగాని, మనమే శిక్షించాలనుకోవడం సరయినదికాదు. అలా చేస్తే మనం మరిన్ని చిక్కులు ఎదుర్కోవలసి వస్తుంది. నా అభిప్రాయాన్ని నేను చెప్పాను. మీరందరూ ఆలోచించుకొని ఒక నిర్ణయానికి రావడం బావుంటుంది" అని మృణాళిని అక్కడనుండి బయలు దేరింది.

క్రాంతి వెంటనే లేచి, "సుబ్బలక్ష్మీ, నువ్విలా మాట్లాడకుండా వుండవలసింది. ఆమె ఒద్దున వున్నారు కాబట్టే ఎన్నయినా చెబుతారని అన్నావు. ఆమె వ్యక్తిగత జీవితం గురించి నీకేమయినా తెలుసా? మృణాళినిగారికి ముప్పయి అయిదేళ్ళు వయస్సు వచ్చినా, సరయిన వ్యక్తి దొరకక, ఆమె ఇంతవరకూ పెళ్ళి చేసుకోలేదు". అది విని సుబ్బలక్ష్మి మాత్రమే కాక, మిగిలిన వాళ్ళు కూడా ఆశ్చర్యపోయారు.

విద్యార్థుల మధ్య చాలాసేపు చర్చలు జరిగాయి. మృణాళిని మేడమ్ శేషగిరి, ఏజంటనీ, అందుకే ఆమె అతనిని పెళ్ళి సమస్య నుండి తెలివిగా బయట పడవేయడానికి ప్రయత్నిస్తున్నారని రమేష్ వాదించాడు. శేషగిరిని సంసారానికి పనికి రాకుండా చేయాలని ఒకరూ, కాలో చెయ్యో తీసేయాలని మరొకరూ ఇలా అనేక శిక్షలను సూచించారు.

"ఇటువంటి అటవికమైన శిక్షలను విధించడం సరయిన పనా? శిక్షించడానికి అసలు మనం ఎవరం? అని ప్రశ్నించిన కిషోర్ మీదా చాలామంది దండయాత్ర చేసారు.

ఉదయాన్నే కాలింగ్ బెల్ మ్రోగేసరికి, ఎవరై వుంటారా? అని మృణాళిని హడావిడిగా తలుపు తెరిచింది. ఎదురుగా క్రాంతి, కిషోర్, సుబ్బలక్ష్మి ఆందోళనలో కనిపించారు.


"ఏమయిందీ?"

"మేడమ్, మన రమేష్ కొంతమంది ఫ్రెండ్సుతో కలిసి, రాత్రి సెకండ్‌షో సినిమా చూసి వస్తున్న శేషగిరిని బాగా కొట్టాడు. శేషగిరి ప్రస్తుతం హాస్పిటల్‌లో వున్నాడు. అతని నడుముకు చాలా బలమయిన దెబ్బ తగిలిందని తెలిసింది. రమేష్‌ను పోలీసులు అరెస్టు చేసారు" అన్నాడు కిషోర్.



# కార్టూన్స్ వేయడం ఎలా? 10

## * సత్యమూర్తి సలహాలు




● వి.వి.సత్యమూర్తి, శ్రీ సత్యసాయి డిజైనింగ్ స్టూడియోస్
11-4-661, రెడ్‌హిల్స్, హైదరాబాద్ 500 004.



### హ్హావ్వ

"అదేంటి. ప్రొడ్యూసర్ గారూ... నెత్తిన తెల్ల బట్టేసుక్కూర్చున్నారూ?"

"ఏం చెప్పనయ్యా డైరెక్టరూ... మనం తీసిన బాలల చిత్రానికి 'ఎ' సర్టిఫికెట్ తగలడింది— ఏం చెయ్యను బాబో —"

—టి.చంద్రశేఖర్ (తెనాలి)

మృణాళినికి ఒక్కసారిగా మెదడంతా మొద్దుబారిపోయినట్లయింది. ఈ మానసపోరాటాలేమిటి? తప్పు చేసినవాడిని తమకు తోచిన విధంగా శిక్షించడమేమిటి? సినిమాల ప్రభావం యువతమీద ఎంత బలంగా వుంటున్నదో కదా అని ఆమె ఆశ్చర్యపోయింది. వాస్తవ జీవితాన్ని పరిశీలించి, దాన్ని మరింత సంస్కారవంతంగా మలుచుకునే విధంగా సినిమాలు తీయాల్సింది పోయింది. దీనికి పూర్తి వ్యతిరేకంగా, వ్యాపార ధోరణిలో తీసిన సినిమాలలో — మసిపూసి మారేడుకాయ చేసిన జీవితాలను చూసి, నేటి యువతరం తమ బ్రతుకులను తీర్చిదిద్దుకొంటోంది. ఇంతకంటె తలక్రిందుల వ్యవహారం మరొకటుంటుందా?

మృణాళిని తన అడ్వకేటు ఫ్రెండును వెంటబెట్టుకుని పోలీసుస్టేషనుకు వెళ్ళి, రమేష్‌ను బెయిల్‌పై విడుదల చేయించింది. అప్పటికే చాలామంది స్టూడెంట్లు పోలీసుస్టేషను దగ్గర చేరారు. మృణాళిని, రమేషూ బయటకు రాగానే, అందరూ కలిసి దగ్గరలో వున్న పార్కులో కూర్చున్నారు.

మృణాళిని వాళ్ళందరినీ వుద్దేశించి మాట్లాడుతూ, "సుధకు ఒక సమస్య ఎదురయినపుడు, ఆమె తరఫున నిలబడి, ఆమెకు కొండంత ధైర్యాన్ని ఇవ్వడం ద్వారా, మీరందరూ ఒకడుగు ముందుకు వేసారు. ఒక నేరస్తుడితో ఆమెకు పెళ్ళి చేయాలనుకోవడంవల్లా, తర్వాత అతన్ని మీరే దారుణంగా శిక్షించడం వల్లా — రెండు అడుగులు వెనుకకు వేసినట్లయింది" అంది.

"మేడమ్, అలాంటి నేరాలను చేసిన వాళ్ళను శిక్షించకుండా, ఏం చేయాలంటారూ?" అని సుబ్బలక్ష్మి అడిగింది.

ఇటువంటి ప్రశ్న వస్తుందని మృణాళిని వూహించింది." ఇవన్నీ సామాజిక సమస్యలు. వ్యక్తిగత శిక్షల ద్వారా వీటిని పరిష్కరించలేము. ఒక్క శేషగిరిని శిక్షించడంతో ఈ సమస్య పరిష్కరింపబడదు కదా! ఇలాంటి శేషగిరులు సమాజంలో ఎంతోమంది వున్నారు.

"ఏ పరిస్థితుల్లో మనిషి నేరం చేస్తున్నాడో, ఏ పరిస్థితుల ప్రేరణ వల్లా, ప్రోద్బలం వల్లా నేరం చేస్తున్నాడో ఆ పరిస్థితుల్ని లేకుండా చేస్తే నేరం జరగదు. నేరస్థులూ వుండరు. అటువంటి ఉత్తమ సమాజాన్ని నిర్మించుకోడానికి ప్రజలు అందరూ సిద్ధమయేంతవరకూ, ఈ సమస్యలు తప్పవు. మనవంతు కర్తవ్యంగా, ఆ మార్పుకోసం జరిగే కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి. అప్పటివరకూ, ఇటువంటి సమస్యలను మనకున్న పట్టు పరిమితులకు లోబడే పరిష్కరించుకోవాల్సి వుంటుంది". *